# వాణిజ్యం ★ అరాచకం ★ విరుగుడు

గరిమెళ్ళ సత్యనారాయణ

మనకు స్వాతంత్ర్యం వచ్చి సంవత్సరము గడచినది. కాని కరవు కాటకాలేమీ తగ్గలేదు. వస్తువుల ధరలు దినదిన ప్రవర్ధమానమగుచున్నవి. ఏ వృత్తిలోనైనా నిలకడగా యెంత సంపాదించుకున్నా నిముషములో హరించిపోవుచున్నది. ఏదో వకరకం చేసుకొని దొంగలాభాలు కొట్టుకొనే వారికి తప్ప యెవరికీ యేమీ మిగులకున్నది. ఏవో బూటకపుమాటలు చెప్పి ఇతరులవద్ద గల ధనమును హరించేవారికి తప్ప నిజముగా కష్టపడేవారికి కడుపు గడియకున్నది.

అందరూ అందలము ఎక్కేవారే అయితే మోసేవారెవరు? అందరూ వర్తకులైతే కొనుక్కునే వారెవరు? అందరికీ వర్తకము సాగించే అవకాశములు, టప్పాలు కొట్టి ధనము తీయగల ఉపాయములు లభించునా? అట్లు లభించే అవకాశములు పూర్వము నూటికి పదిమందికి కలిగితే ఇప్పుడు మహా అయితే నూటికి ఇరువదిమందికి లభించుచున్నవనుకోవచ్చును. తక్కిన యెనభైమంది పొట్టలను ఈ యిరవైమందీ కొట్టి బాగుపడుచున్నారు.

ఈ యిరవైమందిలో నలుగురు మందీ వర్తకులు లేక హోలుసేలు వర్తకులు- వారికి లక్షలకొలది లాభములు వస్తే తక్కినవారికి వందలకొలది లాభములు వచ్చుచున్నవి. ఎవరికెట్టి లాభములు వచ్చినా వినియోగ్ధరుల నెత్తికొట్టి తీసుకున్న బాపతులే కాని సత్యమైనవి కావనుట నిక్కము.

ఈ కాటకమునకంతటికిని కారణమేమిటి? వస్తువులు తక్కువైనందువల్ల ఖరీదులు ఎచ్చుచున్నవా? ఖరీదులు హెచ్చుకొరకు వస్తువులు బయలుపడకుండుటయు, చివుకుటయు కుళ్లుటయు తటస్థించి, తప్పనిసరి యైనప్పుడు మాత్రమే సరుకు బయలుపడుచున్నదా?

బజారులో నే దుకాణములను చూచిన మునపటి బియ్యపురాసులకు, బట్టలమోపులకు, కూరల పోగులకు, దినుసుల తిప్పలకు తక్కువగా లేవు- గ్రామాలలోని సంతలను చూచినా యీ విధముగానే ఉన్నవని అనుకోవచ్చును.

మునుపటికంటె సరుకే మాత్రమును తగ్గలేదు. ఆ మాత్ర మీ మాత్రము తగ్గినా విదేశములనుంచి తెప్పించి భర్తీ చేయుచున్నారు. అన్నీ వుండి ఏదవతనము లేదన్నట్లు ఇంత సరుకూ వుండి యీ కాటకమెందుకు కలగాలి?

ఇది సరుకు లేనందువల్ల కలిగిన కాటకము కాదు-వర్తకులు పేరాస మరగి, పెద్దఖరీదు లిచ్చిన వారికి తప్ప సరుకును అమ్మకపోవుచున్నందువల్ల కలుగుచున్న ముప్పు. అంత పెద్దఖరీదు లిచ్చి జనులు కొనుక్కోజాలకున్నారు.

పూర్వము చిన్నఖరీదు లున్న రోజులలో సరుకంతా విక్రయము కాకపోతే వర్తకులకు నష్టము వచ్చేది. అట్టి నష్టమును భరింపజాలక స్వల్పలాభములతో తృప్తిపడేవారు, సరుకును చౌకగా అమ్మి విడుదలచేసుకొనేవారు. ఆ వచ్చిన డబ్బుతో తిరిగీ సరుకు కొని అమ్ముచుండుటవల్ల సరుకు విరివిగా చేతులు మారుతూ అందరికీ తృప్తిని కూర్చేది.

కాని ఇప్పుడల్లాగ గాదు. సరుకు ఎంత విస్తారముగా ఉన్నా పెద్దఖరీదు లీయగలవారికి తృప్తిగా యెక్కడొక్క దొరకడం, ఇవ్వలేనివారికి కడుపుమాడడం తటస్థించుచున్నది. వర్తకుల లాభము మాటా, వారు కోరిన పెద్దఖరీదు లీయగలవారు ఏ వందమంది ఉన్నా వారిచేయి వదలిన సొమ్ము రావడమే కాక, పెద్దలోభముకూడా వస్తున్నది. తక్కిన సరుకు విడుదలకోసం ఆ సమయమున వారు ఖరీదులు తగ్గిస్తే, మొదటిఖరీదులు చెల్లించేవారివల్ల కలిగేలాభాలు వారికి నున్నచుట్టును. వారు కోరిన పెద్దలాభాలు వారికి వచ్చిన తరువాత, తక్కినసరుకు చెల్లకపోయినా వారికి నష్టము లేకపోయిన తరువాత, జనులు ఆకలి అవసరములు తీరుటకొరకు కాకేల ఖరీదులు తగ్గిస్తారు?

ఇంతకూ తక్కువ ఖరీదు మాత్రము జోతగా చెల్లకపోవడ ముండదు. కడుపు మాడుతున్నవారు ఇల్లువాకిళ్లు పెళ్లాం పిల్లలను అమ్మకొనియైనా ఆ పెద్దఖరీదు నిచ్చి కొనుక్కొని తీరుతారు కాని చూస్తూ చూస్తూ చావనొల్లరు. చేతిలో పుష్కలముగా డబ్బున్నవారు ముందుగానే కొనుక్కొంటారు కనుక వారికి మంచిదినుసు లభించుతుంది. తక్కినవాళ్లు పెక్కు యీడుపోతలు పడి డబ్బు జాగ్రత్త పెట్టుకోవలసి ఒక్కదఫాను కొనుక్కోలేక ఉండీ ఉడిగీ కొనుక్కోవలసి వస్తుంది కనుక అతి పెద్దఖరీదుకు ఆ పుప్పిసరుకు వారికి లభించి వారి స్వారోగ్యంపాలు అరాయిన్ను పాలు చేయును. మరియెవరూ కొనుక్కోలేని సరుకును తామూ కాలువలలో పోసినా వారికి కలిగే కుండకమేమీ లేదు.

వాణిజ్యవిధానములో ఇంతకంటె అరాచకము లేదు. ఈ అరాచకమువల్లనే వర్తకులు బాగుపడుతూ, ప్రభుత్వానికి పెద్దపన్నులు చెల్లించి, అది ఖర్చులు భరించి సాగుటకు సాయపడుతున్నారు కనుక, ప్రభుత్వములు రహస్యముగా వారినే బలపరచుచున్నవి. ఇట్లు వర్తకులును ప్రభుత్వములును కలిసి ప్రజల ప్రాణమానములు హరించుచున్నారు. ప్రభుత్వములు వర్తకులు చేస్తున్న ఈ అరాచకము నింత సహిస్తూకూడా, ప్రజలిందుకు విరోధముగా ఏ మాత్ర మాందోళనము చేసినను చెవిని పెట్టకుండుటయే కాక, వారినే అరాచకులుగా భావించి కేసులుపెట్టి జెయిలుశిక్షలు విధించుచున్నారు.

ఇదంతా ప్రభుత్వముల లోపముకాని వేరు కాదనుట స్పష్టము. ప్రజలలో అరాచకమను కొనేదానిని అణచుటకు ఇన్ని ఆర్డినెన్సులు ప్యాసు చేస్తున్న ప్రభుత్వములు వర్తకులు చేస్తున్న ఈ అరాచకము నణచడానికి ఒక్క ఆర్డినెన్సు ప్యాసు చేయజాలరా? ఆ అరాచక మణిగితే ఈ అరాచకము సమ్మెలు మొదలైనవేవీ కలికానికైనా కానరాకుండా హరించేవి!

రేషనింగు కంట్రోలు ఉన్న రోజులలోనే కాస్త నయముగా వుండేది. చాలీచాలని తిండి బట్టయైనను అందరికీ అందేది. గాంధీమహాత్ముని ఆందోళనవలన కంట్రోళ్లు తీసినప్పటినుంచి ఖరీదులు [illegible] వీతి ఉన్నదనీ, దానినిబట్టి ప్రజాశ్రేయస్కరమై తమ కనుకూలమగు లాభములు కలిగేటట్లు వర్తకులు అమ్మగడంగుదురనియూ గాంధీజీ భయపడినాడు. ఆ భ్రమ విచ్ఛిన్నం కాకముందే ఆయన మరణించాడు.

తిరిగీ కంట్రోళ్లు పెట్టడమా మానడమా అనే సమస్యలో ప్రభుత్వములు పడినవి. కంట్రోళ్లు రేషనులు పెట్టినా పెట్టకపోయినాకూడా ప్రజలకు నష్టమే. రేషనుంటే దొంగబజారులో కొనుక్కొని దొరికి జెయిళ్లపాలు కావాలి. లేకుంటే బహిరంగబజారు ఖరీదులు చెల్లించలేక కడుపు మాడవాలి.

ఇందుకై ప్రభుత్వములు వర్తకులపై కఠినచర్యలకు పూనుకోవాలి. ప్రాతవారి కెవరికీ లైసెన్సులివ్వడం మానేసి బుజువర్తనగల కొత్తవారికే లైసెన్సులియ్యవాలి, అట్టివా రెవరూ దొరకకపోతే, ప్రభుత్వచర్యలు మానుకొని ప్రజలతరఫున వర్తకం తామే సాగించాలి.

అయితే ప్రభుత్వాలే వర్తకానికి పూనుకుంటే, వర్తకులను కరచిన పామే వారినికూడా కరవకుండునేమో! వర్తకులమీద చర్య తీసికొనుటకైనా (తీసుకున్నా తీసుకోకపోయినా) ప్రభుత్వమంటూ వేరె యేదో ఉన్నదన్న భరోసాయైనా ఉంటుంది. ప్రభుత్వమే ఇటువంటి వర్తకానికి దిగితే ఆ కాస్త భరోసాకూడా పోతుంది.

మహా నిస్వార్థియగు త్యాగపురుషుడు, రాజకీయపరిజ్ఞానవేత్త, కఠినచర్యాసమర్థుడగు నియంత యొకడుద్భవించి కార్యక్రమమునకు పూనుకొంటే ఈ అరాచక మణగదు. అతడే ప్రజలపాలిటి కల్పకమై రక్షకుడై అలరారుతాడు. ప్రస్తుతం నడుస్తున్న ప్రజాపరిపాలనావిధానమంతా ఈ రీతిగా బూటకమైయున్నది కనుక, అటువంటి అవతారమూర్తి ఆగమనమునకే భారతదేశము నిరీక్షించుచున్నదా అనిపించుచున్నది. అటువంటి అవతారమూర్తి ఇప్పుడు కనిపించకుండుటయే ఆశ్చర్యముకాని, అవతరించి ఈ తుచ్ఛవిధానము నంతటిని తుత్తునియలు చేసినచో ఆశ్చర్య మేమియు లేదు. ఈ అజ్ఞానరంగమున అది యొక్కటియే జ్ఞానభిక్షాదానవిధానము.

ANANDAVANI is printed by V. AZIZULLA at Deccan Times Press Madras.
and published by V. KALIDAS, at 12 Thambu Chetty Street, Madras.
Editor: V. KALIDAS. Associate Editors : Andra Seshagiri Rao B.A. Mudda Viswanadham